

దేవదాసీ వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలి
● బళ్లారి లీగల్ అథారిటీ చైర్‌పర్సన్ కేజీ శాంతి పిలుపు
● దివ్యాంగులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్న న్యాయాధికారి
9

తుంగభద్రతకు చర్యలు



తుంగభద్ర డ్యాంకు కొత్త గేట్లు అమర్చడంలో భాగంగా పాత గేటు తొలగించే పనుల్లో నిమగ్నమైన టెక్నికల్ సిబ్బంది

- టీబీ డ్యాం గేట్ల ఏర్పాటుకు శ్రీకారం
- ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించిన బోర్డు అధికారులు
- నూతనంగా 33 గేట్ల అమరిక
- ఏపీ వాటా రూ.20 కోట్లు విడుదల
- నిధులు విడుదల చేయని కర్ణాటక ప్రభుత్వం
- జపాన్ నుంచి బేరింగుల దిగుమతి
- 2026 జూన్ ఆఖరుకు పూర్తయ్యేలా ప్లాన్

బళ్లారి/కర్నూలు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం నూతన గేట్లు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. టీబీపీ బోర్డు అధికారులు ప్రత్యేక పూజలు చేసి పనులు ప్రారంభించారు. కాంట్రాక్ట్ సంస్థ పాత గేట్లు తొలగించే పనులకు అంకురార్పణ చేశారు. రూ.44 కోట్లతో చేపట్టే పనులను గుజరాత్‌కు చెందిన హార్డ్‌వేర్ అండ్ టూల్స్ సంస్థ చేపట్టింది. ఎట్టి పరిస్థితుల్లో 2026 జూన్ ఆఖరులోగా గేట్లు అమరిక పూర్తి చేసేందుకు బోర్డు ఇంజనీర్లు పక్కా ప్రణాళిక తయారు చేశారు. దీంతో జనవరి 11 వరకు సాగులో ఉన్న పంటలకు సాగునీరు ఇచ్చి ఆ తరువాత అవసరాన్ని బట్టి తాగునీరు మాత్రమే ఇస్తామని తేల్చి చెప్పారు. గేట్ల ఏర్పాటు కోసం ఆంధ్రప్రదేశ్ వాటా నిధులు రూ.20 కోట్లు విడుదల చేసింది. కర్ణాటక వాటా నిధులు విడుదల చేయాల్సి ఉంది.

ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల ప్రధాన నీటి ఆధారమైన తుంగభద్ర డ్యాం నూతన గేట్లు ఏర్పాటుకు టీబీపీ బోర్డు అధికారులు సన్నాహాలు చేపట్టారు. డ్యాంకు మొత్తం 33 క్రస్ట్‌గేట్లు గేట్లు ఉన్నాయి. గతేడాది ఆగస్టులో 19వ నంబరు గేటు కొట్టుకుపోవడంతో డ్యాం భద్రతపై పలు అనుమానాలు తలెత్తాయి. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ), నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ), డ్యాంను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన ఏకే బజాజ్ కమిటీ సిఫార్సుల మేరకు గేట్లు, ప్రాజెక్టు సామర్థ్యంపై టీబీపీ బోర్డు అధ్యయనం చేయించింది. గేట్ల సామర్థ్యం నిర్ధారణ, రేడియోగ్రఫీ, ఎంపీటీ, అల్ట్రా సోనిక్, డీపీటీలో అనుభవం, నైపుణ్యం కలిగిన కేఎస్‌ఎన్‌డీటీ సర్వీసెస్ సంస్థ అధ్యయనం చేసింది. 2024 ఆగస్టులో కొట్టుకుపోయిన 19వ గేటుతో పాటు మరో 32 గేట్ల సామర్థ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి గేటుకు 15 రకాల పరీక్షలు నిర్వహించారు. డ్యాం గేట్లన్నీ భారీగా తుప్పుపట్టి భారీ రంధ్రాలు ఏర్పడ్డాయని, కొన్ని ప్రదేశాల్లో రంధ్రాల వల్ల గేటు ప్లేట్లు బాగా ధ్వంసం అయ్యాయని, గుస్సెట్ ప్లేట్లు, దిగువ స్టిఫినర్లు, గేట్లకు సపోర్టుగా ఉండే గడ్డర్లు, సపోర్టింగ్ ప్లేట్లు కూడా బాగా తుప్పుపట్టి, చిల్లులు పడ్డాయని ఆ సంస్థ ఇచ్చిన నివేదికలో వెల్లడించింది. గేట్ల సామర్థ్యం 45 ఏళ్లు కాగా, తుంగభద్ర గేట్లు 70 ఏళ్లు దాటడంతో మొత్తం గేట్లన్ని మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టంగా వివరించారు. ఆ నివేదిక ఆధారంగా డ్యాం 33 గేట్లు తొలగించి వాటి స్థానంలో కొత్త గేట్లు ఏర్పాటు చేసేందుకు టీబీపీ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది.



కొత్త గేట్లను డ్యాం వద్దకు తరలిస్తున్న కార్మికులు

● పాత గేట్ల తొలగింపు పనులు

తుంగభద్ర డ్యాం 33 గేట్లు కొత్తగా ఏర్పాటు చేసేందుకు రూ.44 కోట్లతో టెండర్లు పిలిచారు. గుజరాత్‌కు చెందిన 'హార్డ్‌వేర్ టూల్స్' సంస్థ టెండరు దక్కించుకుంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో జూలై నుంచి జలాశయంలోకి వరద మొదలు కావడంతో ఆ సమయంలో గేట్లు ఏర్పాటు పనులు మొదలు పెట్టలేదు. అయితే గేట్ల తయారి (ఫ్యాబ్రికేషన్) పనులు మాత్రం కాంట్రాక్ట్ సంస్థ చేపట్టింది. ఇప్పటికే 15 గేట్లు తయారు చేశారు. వీటిని అమర్చాలంటే పాత గేట్లు తొలగించాల్సి ఉంది. ఆ పనులను శుక్రవారం మొదలు పెట్టారు. బోర్డు సెక్రెటరీ ఓఆర్‌కే రెడ్డి, ఎస్ఈ నారాయణ నాయక్, బోర్డు కర్ణాటక సభ్యుడు కృష్ణమూర్తి కులకర్ణి, మునిరాబాద్ ఎస్ఈ, విజయనగర (హోస్పేట్) జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఆర్డీఓ సహా ఏపీ, కర్ణాటక రైతులు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. తుంగభద్రమ్మకు జలహారతి ఇచ్చారు. తరువాత గేట్ల తయారి, అమరిక టెక్నికల్ సిబ్బంది పాత గేట్లను తొలగించే పనులు మొదలు పెట్టారు. సోమవారం నుంచి దాదాపు 80 మందితో పనులు వేగంగా చేపడుతామని బోర్డు ఎస్ఈ నారాయణ నాయక్ ఆంధ్రజ్యోతికి వివరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 2026 జూన్ ఆఖరులోగా కొత్త గేట్లు ఏర్పాటు చేసే దిశగా ముందుకు వెళ్తామన్నారు.



గేట్ల ఏర్పాటు కోసం పూజలు చేస్తున్న బోర్డు అధికారులు



డ్యాం సమీపంలో తయారవుతున్న గేట్లు

● జపాన్ నుంచి బేరింగుల దిగుమతి

టీబీపీ డ్యాంకు ఏర్పాటు చేసే గేట్లకు బేరింగులు ఎంతో కీలకం. మన దేశంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన బేరింగ్స్ అందుబాటులో లేకపోవడంతో జర్మని నుంచి దిగుమతి చేసుకోవాలని అనుకున్నారు. అక్కడ కూడా అదే పరిస్థితి ఉండడంతో ఒక్కో గేటుకు 12 చొప్పున 396 బేరింగులు దిగుమతి చేసుకున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. ఇందుకోసం రూ.2.50 కోట్లు ఖర్చు చేశారు. గేట్లు ఎత్తడం, దించడంతో బేరింగు లు అత్యంత కీలకమని, అందుకే జపాన్ నుంచి దిగుమతి చేసుకోవాల్సి వచ్చిందని ఏపీ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మెకానికల్ సలహాదారు కన్నయ్యనాయుడు పేర్కొన్నారు.

● నిధులివ్వని కర్ణాటక

డ్యాం నిర్వహణ, మరమ్మతులు.. వంటి పనులకు ఏపీ ప్రభుత్వం 55 శాతం, కర్ణాటక ప్రభుత్వం 45 శాతం వాటా నిధులు చెల్లించాల్సి ఉంటుంది. 33 గేట్లలో ఏపీ నిర్వహణలోకి 15 గేట్లు, కర్ణాటక నిర్వహణలోకి 18 గేట్లు వస్తాయి. మొత్తం 33 గేట్లు కొత్తగా ఏర్పాటు కోసం రూ.44 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారు. ఇందులో ఏపీ వాటా నిధులు రూ.20 కోట్లు ఇప్పటికే టీబీపీ బోర్డు విడుదల చేసినట్లు ఏపీ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మెకానికల్ సలహాదారు కన్నయ్యనాయుడు వివరించారు. అయితే ఈ నిధుల విషయంపై కర్ణాటకకు లేఖ రాశామని, రెండు మూడు రోజుల్లో ఆ రాష్ట్రం కూడా వాటా నిధులు విడుదల చేస్తుందని బోర్డు ఎస్ఈ నారాయణ నాయక్ ఆశాభావం వ్యక్తం చేశారు.

డీకే సీఎం అయితే మంత్రి పదవి కష్టమే

● మాజీ మంత్రి రాజణ్ణ



బెంగళూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): డీకే శివకుమార్ సీఎం అయితే నేను ఆయన క్యాబినెట్‌లో మంత్రి కాలేనని సీనియర్ నేత, మాజీ మంత్రి రాజణ్ణ అభిప్రాయపడ్డారు. తుమకూరులో శనివారం 'సహకార రత్న' పురస్కారాల ప్రదాన కార్యక్రమం తర్వాత మీడియాతో మాట్లాడుతూ తాను ఇప్పటికే ఓసారి చెప్పానని అందులో మార్పు ఉండదన్నారు. డీకే శివకుమార్ ముఖ్యమంత్రి అయితే తనకు ఎటువంటి మంత్రి పదవి వద్దన్నారు. మరొకరికి అవకాశం ఇవ్వవచ్చునన్నారు. తాను ఎప్పుడూ అధికారం కోసం ప్రాకులాడలేదన్నారు. అధికారం దక్కితే ఏం చేయవచ్చుననేది నిరూపించానన్నారు. సహకారశాఖ మంత్రిగా ఈ రంగంలో సవరణలు జారీ చేస్తే విప్లవాత్మక మార్పు సాధ్యమన్నారు. సొసైటీలలో రిజర్వేషన్ వ్యవస్థను తీసుకొచ్చానన్నారు. సీఎం, డీసీఎంల లగ్జరీ వాచీల విషయం వదిలి రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై దృష్టి సారించానన్నారు.

దేశం మెచ్చిన నేత అంబేడ్కర్: సీఎం

బెంగళూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): దేశం మెచ్చిన అపురూపనేత అంబేడ్కర్ అంటూ సీఎం సిద్దరామయ్య కొనియాడారు. దేశంలో దళితులకే కాకుండా నిమ్న వర్గాలకు గౌరవం తీసుకురావడమే కాక సామాజికన్యాయం లభించేదాకా పోరాట ప్రయత్నం చేశారన్నారు. బీఆర్ అంబేడ్కర్ 69వ పరినిర్వాణ దినం పురస్కరించుకుని విధానసౌధలో శనివారం అంబేడ్కర్ విగ్రహానికి పూలు చల్లి నివాళులు అర్పించారు. సాంఘిక సంక్షేమశాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, డీసీఎం డీకే శివకుమార్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్ప తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీఎం మాట్లాడుతూ సమాజవ్యవస్థలో మార్పుకు అంబేడ్కర్ పాటుపడ్డారన్నారు. మాజీ సీఎం, కేంద్రమంత్రి కుమారస్వామి భగవద్గీతను పాఠ్యాంశంగా చేర్చాలని కేంద్ర విద్యాశాఖ మంత్రికి లేఖ రాయడంపై మండిపడ్డారు. బీజేపీతో మైత్రి తర్వాత కుమారస్వామి మనువాదిగా మారారన్నారు. మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. సమసమాజ నిర్మాణం అంబేడ్కర్ ఆశయంగా ఉండేదన్నారు. డీసీఎం డీకే శివకుమార్ సహా పలువురు మంత్రులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు హారతి ఇస్తున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం సిద్దరామయ్య తదితరులు



విధ్వంసక మనఃస్థితికి విశ్వం

● బెంగళూరు సాహిత్య ఉత్సవ్‌లో బానుముస్తాక్



సాహిత్య ఉత్సవ్‌లో ప్రసంగిస్తున్న బానుముస్తాక్

బెంగళూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విశ్వం ప్రస్తుతం విధ్వంసక మనఃస్థితికి చేరిందని, ఎంతోమంది నాయకులు ఏదో ఒకదాన్ని ధ్వంసం చేయాలనే ఆలోచనలో ఉన్నారని బుకర్‌ప్రైజ్ విజేత బానుముస్తాక్ అభిప్రాయపడ్డారు. బెంగళూరు సాహిత్య ఉత్సవ్ 14వ సదస్సులో బానుముస్తాక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలస్తీనా ధ్వంసం అవుతోందని ఇజ్రాయెల్ జైళ్లలో కూర్చుని పాలస్తీనియన్ రచయిత బషీర్ రచనకు ప్రతిష్ఠాత్మక పురస్కారం దక్కుతుందన్నారు. పురస్కారం స్వీకరించే వేళ బషీర్ పెదవులు తడి ఆరాయని, గొంతు పొంగిందని, కళ్లు చెమర్చాయని తన ప్రపంచం ధ్వంసం అవుతోందని బషీర్ తటస్థుడిగాను, మౌనంగాను ఉండలేదన్నారు. అన్యాయం, దౌర్జన్యం విషయంలో మౌనంగా ఉంటే అది సమంజసం అని ధ్రువీకరించినట్టు అవుతుందన్నారు. ఎన్నో సందర్భాలలో నేరుగా మౌనం వీడడం సాధ్యం కాదన్నారు. డిసెంబరు 6 అంబేడ్కర్, భాతృత్వాన్ని కోల్పోయిన రోజన్నారు. ధ్వంసమైంది బాబ్రీ మసీదు కాదని బదులుగా దేశ ప్రజల భాతృత్వ భావన అన్నారు. ఇవి రెండూ మన ప్రజాప్రభుత్వానికి నష్టమన్నారు. కొన్ని చారిత్రాత్మక అంశాలు పరిశీలించాలని మనం కోల్పోయింది ఏమని తెలుసుకోవాలని, భవిష్యత్తులో ఏం చేయాలనేది తెలుసుకునేందుకైనా వెనుతిరిగి చూడాలన్నారు. ఫ్రీడంపార్కులో ఏర్పాటు చేసిన నాలుగువేదికల ద్వారా సాహిత్యఉత్సవ్‌లో చర్చాగోష్టిలు కొనసాగాయి. కావలిన బుర్జు, కోశతెరయిరి, ఎడబ్యారెక్, కుడిబ్యారెక్‌ల పేరిట వేదికలు ఏర్పాటయ్యాయి.



కంప్లి పట్టణాన్ని కప్పేసిన పొగమంచు

ఊరినే ముంచేసింది..?

కంప్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కంప్లి పరిసర ప్రాంతాల్లో పొగమంచు ఊరినే కప్పేస్తోంది. శీతాకాలం ప్రారంభంలోనే చలి తీవ్రతతో వణికిపోతున్నారు. శనివారం ఉదయమే కంపిల్లో ఎక్కడ చూసినా పొగమంచు కప్పేసింది. ఉదయం 10 గంటలకు కూడా సూర్యుడు కనపడడం కష్టంగా మారింది. మంచు కారణంగా రహదారులు మూసుకుపోయాయి. ఉదయమే 9గంటల లోపల బయటకు రావడానికి ప్రజలు ఇబ్బంది పడ్డారు. వాహనదారులు రస్తా కనబడకపోవడంతో లైట్లు వేసుకుని ప్రయాణం కొనసాగించారు. కంప్లితో పాటు కురుగోడు సిరిగేరి, కుడిటిని తదితర గ్రామాల్లో కూడా పొగమంచు కప్పేసింది. గ్రామాల్లో పలుప్రాంతాల్లో చలిమంట వేసుకుని కాపుకున్నారు. సాయంత్రం కూడా చలి చంపేస్తోంది. ఉష్ణోగ్రతలు భారీగా పడిపోవడంతో పిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు.



సిరిగేరిలో ఇళ్లపై కనిపిస్తున్న పొగమంచు

ఆదిచుంచనగిరి స్వామీజీకి కుమార క్షమాపణలు



బెంగళూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథస్వామీజీకి కేంద్రమంత్రి కుమారస్వామి బహిరంగ క్షమాపణలు చెప్పారు. మండ్య వీసీ ఫాంలో జరుగుతున్న కృషి మేళాలో శనివారం పాల్గొన్న కుమారస్వామి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇటీవల తన వ్యాఖ్యలు స్వామీజీకి బాధ కలిగి ఉంటే క్షమాపణలన్నారు. నిర్మలానందనాథస్వామీజీ ఉన్నత విద్యావంతులన్నారు. అంత చదువుకున్న స్వామీజీ మరొకరు లేరన్నారు. గౌరవానికి భంగం కలగకూడదనే తన వ్యాఖ్యలు బాధ కలిగించి ఉంటే క్షమించాలన్నారు. బాలగంగాధరనాథస్వామీజీ సమాజంలో గౌరవం కాపాడేందుకు వీధికి దిగారని గుర్తు చేశారు. దేవెగౌడ ముఖ్యమంత్రి కావాలని స్వామీజీ మనసులో ఉండేదన్నారు. తన పట్ల ప్రత్యేకమైన ప్రేమ, అభిమానం చూపారన్నారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలు ఎలా సాగుతున్నాయనేది అందరికీ తెలుసునన్నారు.

రాష్ట్రం గురించి పట్టించుకోరు

● కేంద్ర మంత్రి కుమారస్వామిపై సీఎం మండిపాటు ● అసమానతలు తొలగించేందుకే గ్యారెంటీలు అన్న ముఖ్యమంత్రి



బెంగళూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి అన్యాయం జరిగినా కేంద్రమంత్రి కుమారస్వామి మాట్లాడరని సీఎం సిద్దరామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. హాసన్‌లో శనివారం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా జిల్లా ప్రజలను ఉద్దేశించి సీఎం మాట్లాడారు. 'అహింద' సంఘం కట్టింది నేనే అన్నారు. భాగ్యల పేరిట పథకాలు, గ్యారెంటీల పేరిట భరోసా కల్పించామన్నారు. దళితుల, వెనుకబడినవర్గాలకు ఆర్థికంగా ఎదిగేందుకు పాటుపడ్డానన్నారు. అసమానతలు తొలగించేందుకే గ్యారెంటీలు అమలు చేస్తున్నామన్నారు. అహిందకు సిద్దరామయ్య సాధన ఏమని కుమారస్వామి ప్రశ్నిస్తారని ఆయన రైతు వారసుడు కాదా..? అని ప్రశ్నించారు. మేకెదాటు ప్రాజెక్టుకు అనుమతులు సాధించలేరన్నారు. మేకెదాటుకు సుప్రీంకోర్టు రాష్ట్రానికి అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. అయితే కేంద్రప్రభుత్వం వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని, ఈ అంశంపై కుమారస్వామి స్పందించరన్నారు. మండ్య జిల్లాకు ఎంతో అన్యాయం జరుగుతోందన్నారు. మండ్య ఎంపీగా కుమారస్వామి సాధన ఏమని ప్రశ్నించారు. భద్ర ఎగువ ప్రాజెక్టుకు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ రూ.5,300 కోట్లు బడ్జెట్‌లో కేటాయించి మరో 2-3 నెలలకే రెండేళ్లు అవుతుందని, ఎందుకు గ్రాంట్లు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. కేంద్రం జీఎస్టీ సవరణతో రాష్ట్రానికి 12వేల కోట్ల రూపాయలు నష్టం వాటిల్లుతోందన్నారు. ఏటా రూ.1.20 లక్షల కోట్లు పన్నులు వసూలు లక్ష్యంగా పెట్టుకున్నామని, కేంద్రం పాలసీలతో నష్టమన్నారు. కాంగ్రెస్ పార్టీ 492 ఎన్నికల హామీలను ఇచ్చామని రెండున్నరేళ్లలో 242 పరిష్కరించామన్నారు. 2013-18 కాలంలో 162 హామీలకు 158 అమలు చేశామన్నారు. హేమావతి జలాశయంకు అనుబంధంగా 700ల ఎకరాలలో ఉద్యానవనం ఏర్పాటు చేస్తామని తద్వారా పర్యాటక కేంద్రంగా మారనుందన్నారు. సమాజంలో అందరూ సమానంగా ఉండాలనే లక్ష్యంతో గ్యారెంటీలు అమలు చేశామని వీటిని వ్యర్థమనేవారికి ప్రజలే బుద్ధి చెప్పాలన్నారు. దేవుడు వరాలు శాపాలు ఇవ్వరని కేవలం అవకాశాలు మాత్రమే ఇస్తారన్నారు. మాకు అధికారం ప్రజలు కట్టబెట్టిన అవకాశం వచ్చిన ప్రతిసారి అన్నివర్గాలకు పథకాలు వర్తింపచేశామన్నారు. మా గ్యారెంటీలకు విమర్శలు చేశారని కానీ వాటిని వ్యతిరేకించిన వారే పేర్లుమార్చి ఇతర రాష్ట్రాలో అమలుకు సిద్దమయ్యారన్నారు. ఇటీవల హాసనాంబ ఉత్సవాల వేళ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కృష్ణభైరేగౌడ భక్తులకు కల్పించిన సౌలభ్యాలు, దర్శనాల విషయంలో ఎంతో మంది ప్రశంసించారన్నారు. ప్రజల జేబులకు లక్షకోట్లు జమచేశామన్నారు. మేకెదాటు కోసం హాసన్ ప్రజలు నిరసనలలో భాగస్వామ్యులయ్యారని మన మొరను సుప్రీం కోర్టు ఆలకించిందన్నారు. మా ప్రభుత్వ ఆరవ గ్యారెంటీ భూమి గ్యారెంటీ అంటూ ప్రకటించారు. హాసన్ ఎంపీ జిల్లా ప్రజల గౌరవానికి భంగం కలిగించరన్నారు. విమర్శలు సాధారణమని కానీ హాసన్ సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడ్డామన్నారు. ఇదే సందర్భంగా 298 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కృష్ణభైరేగౌడతో పాటు మంత్రులు సతీష్‌జార్కిహోళి, మహదేవప్ప, జమీర్‌అహ్మద్, ఎమ్మెల్యే శివలింగేగౌడ తదితరులు భాగస్వామ్యులయ్యారు. ఇదే వేదికపై జేడీఎస్ ఎమ్మెల్యే సీఎన్ బాలకృష్ణ ముఖ్యమంత్రికి సత్కరించారు. జిల్లా నలుమూలల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆభరణాల కోసం ఇంటి ఓనర్ హత్య

నిందితుల అరెస్ట్


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

గుత్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జరిగిన ఓ మహిళా హత్య కేసును వారం రోజుల్లోనే పోలీసులు ఛేదించారు. సీఐ రామారావు ఆధ్వర్యంలో ఎస్ఐ సురేష్‌బాబు, సిబ్బంది ముమ్మరంగా దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఐ, ఎస్ఐల సమక్షంలో శనివారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కేసు వివరాలను వెల్లడించారు. గుత్తిఆర్ఎస్‌కు చెందిన విజయలక్ష్మి అలియాస్ రెడ్డమ్మ(54) ఇంట్లో బంధాల రాము, బంధాల అలిసమ్మ దంపతులు అద్దెకు ఉండేవారు. వీరికి డబ్బు అవసరం కావడంతో పథకం మేరకు విజయలక్ష్మిని ఆమె పొలానికి రప్పించారు. అక్కడ కంపచెట్లలో విజయలక్ష్మిని గొంతు నులిమి చంపేశారు. తర్వాత ఆమె మెడలో ఉన్న బంగారు చైను, కమ్మలు, సెల్‌ఫోన్ తీసుకున్నారు. అదే రోజు ఆటోలో రెడ్డమ్మ మృతదేహాన్ని వేసుకుని గుంతకల్లు మండలం వైటీ చెరువు గ్రామం వద్ద ఉన్న చెరువులో పడేశారు. మృతురాలి బంగారు చైనును అదే రోజు సాయంత్రం ఓ ప్రైవేట్ సంస్థలో తాకట్టు పెట్టి, వచ్చిన డబ్బును అవసరాలకు వాడుకున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కేసును పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేశామన్నారు. వారు మృతదేహాన్ని తరలించిన ఆటోతో పాటు సెల్ ఫోన్, కమ్మలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ నిందితులు గతంలో చిన్న మహారాజు అనే వ్యక్తి ఇంట్లో అద్దెకు ఉంటూ అక్కడ కూడా బంగారు చైనును అపహరించి ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి డబ్బులు సొమ్ము చేసుకున్నారని ఆయన తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

డీ.హీరేహాళ్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నిప్పు అంటుకొని గాయపడిన కురుబ సిద్దేశ్(38) శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు కర్ణాటక చిత్రదుర్గం జిల్లా పొక్కుర్తి గ్రామానికి చెందిన సిద్దేశ్ మండల కేంద్రానికి చెందిన లక్ష్మిని 12 ఏళ్ల కిందట వివాహం చేసుకుని ఇక్కడే ఉండేవాడు. కూలి పని చేసుకుని జీవనం సాగిస్తుండేవాడు. ఈ క్రమంలో నవంబరు 30న మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద కొంతమంది చలికాపుకోవడం కోసం మంటను వేశారు. సిద్దేశ్ కూడా అక్కడికి వెళ్లాడు. చలికాచుకుంటున్న సమయంలో తన పంచెకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. స్థానికులు అప్రమత్తమై మంటలను ఆర్పి, బళ్లారి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలియజేశారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలియజేశారు. వీరికి ఒక కుమారుడు సంతానం కలరు.

దుస్తులు ఉతకడానికి వెళ్లి యువతి...

లేపాక్షి, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువలో గల్లంతైన యువతి మృతదేహం మామిడిమాకులపల్లి వద్ద లభ్యమైంది. పోలీసులు తెలిపిన మేరకు మండలంలోని బ్రహ్మేశ్వరంపల్లి గ్రామానికి చెందిన అలివేలమ్మ కుమార్తె సుప్రియ(20) హంద్రీనీవా కాలువలో బట్టలుతకడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి అందులో పడిపోయింది. నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో కొట్టుకుపోయింది. మామిడిమాకులపల్లి వద్ద చెట్టుకు తగులుకుని తేలియాడుతున్న సుప్రియ మృతదేహాన్ని పశువుల కాపర్లు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఎస్ఐ నారాయణ ఘటనా స్థలానికి వెళ్లి బ్రహ్మేశ్వరంపల్లికి చెందిన యువతిగా గుర్తించారు. మృతురాలికి తల్లి, సోదరుడడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నవ వరుడి ఆత్మహత్య

నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల వద్ద యాడికి మండలం నగరూరు వాసి మృతి


శరత్‌కుమార్ (ఫైల్)

యాడికి, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): వివాహమైన నెల రోజులకే మండలంలోని నగరూరు గ్రామానికి చెందిన శరత్‌కుమార్ (25) అనుమానాస్పదంగా శనివారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నగరూరు గ్రామానికి చెందిన జయరాముడు, ఆనంద కుమారి దంపతులకు ఇద్దరు కుమారులు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. పెద్ద కుమారుడు శరత్‌కుమార్ ఇంటర్ వరకు చదివి, బెంగళూరులో మినీ షాపింగ్‌మాల్ నిర్వహిస్తుండేవాడు. బళ్లారి ప్రాంతానికి చెందిన యువతితో నవంబరు 2న అతడికి వివాహమైంది. బెంగళూరులో ఉంటున్న శరత్‌కుమార్ శుక్రవారం నంద్యాల జిల్లా కొలిమిగుండ్లలో స్నేహితుడి వద్దకు వచ్చాడు. అతడితో కలిసి ఆనందంగా ఉన్నాడు. విధులకు వెళ్లిన స్నేహితుడికి ఫోన్ చేసి, విషపుగుళికలు మింగినట్లు చెప్పాడు. స్నేహితుడు వెంటనే వచ్చి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. శరత్‌కుమార్‌ను తాడిపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్తుండగా.. మార్గమధ్యలో శరత్‌కుమార్ మృతిచెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు కొలిమిగుండ్ల పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

తాడిపత్రి, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వృద్ధుడు శనివారం మృతిచెందాడు. రైల్వే పోలీసు వరప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వృద్ధుడు ప్లాట్‌ఫాం టికెట్ తీసుకుని, రైల్వే ప్లాట్‌ఫాం బెంచీమీద కూర్చున్నాడు. కొంతసేపటికి కదలకపోవడంతో అనుమానం వచ్చి పలకరించగా మాట్లాడలేదు. వాలిపోయాడు. దీంతో 108 సాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వృద్ధుడి వయస్సు 60ఏళ్లపైగా ఉంటుందని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

కుక్క కాటుతో 11 మందికి గాయాలు

రాయదుర్గంరూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని 74 ఉడేగోళం గ్రామంలో కుక్క కాటుతో 11 మంది గాయపడ్డారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో పిచ్చికుక్క చొరబడి సతీష్, వీరభద్ర, రాజు, ఉలిగప్ప, గంగమ్మ, సందీప్, మల్లేష్, పరమేశ్వరప్ప, సవరమ్మ, మల్లేష్‌ను తీవ్రంగా కరచి, గాయపరచింది. మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వీరభద్ర, రాజును రాయదుర్గం ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమచికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు వైద్యులు తెలిపారు.

64 గొర్రెపిల్లలు..

శింగనమల, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకులేడు గ్రామంలో వీధి కుక్కల దాడిలో 64 గొర్రెపిల్లలు మృతిచెందాయి. తద్వారా రూ.3 లక్షలు పైగా నష్టం వాటిల్లిందని కాపర్లు తెలిపారు. ఆకులేడుకు చెందిన చిన్న నారాయణస్వామి, చిన్న రాజుకు గొర్రెల మందను గ్రామ సమీపంలో తోలుకున్నారు. శనివారం పిల్లలను ఇనుప కంచె మధ్యలో ఉంచి గొర్రెలను మేపునకు తోలుకెళ్లారు. వీధి కుక్కలు దాడిచేసి 64 గొర్రెపిల్లలను చంపేశాయి. సాయంత్రం వచ్చిన కాపర్లు మృతిచెందిన గొర్రెపిల్లలను చేసి, కన్నీరుమున్నీరయ్యారు. సలకంచెరువు పశువైద్యాధికారి కిరణ్‌కూమార్ రెడ్డి.. గొర్రెపిల్లలకు పంచనామా నిర్వహించారు.


గొర్రెపిల్లల కళేబరాలు

మళ్లీ పాత కథేనా..?

క్యాంపు రాజకీయాలకు తెరలేపిన వైసీపీ

టీడీపీ వైపు కుంటిమద్ది ఎంపీటీసీ మొగ్గు?

11న రామగిరి ఎంపీపీ ఉప ఎన్నిక

రామగిరి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రామగిరి ఎంపీపీ ఉప ఎన్నిక మళ్లీ పాతకథనే తలపిస్తోంది. ఈనెల 11న ఎంపీపీ ఉప ఎన్నిక జరగనుండగా ఎప్పటిలాగే వైసీపీ క్యాంపు రాజకీయాలు మొదలు పెట్టింది. వైసీపీకి చెందిన ఐదుగురు ఎంపీటీసీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డిని శనివారం కలిసి ఆయన ఆధీనంలోనే ఉన్నట్టు సమాచారం. గత ఎన్నికల సమయంలో వైసీపీకి ఆరుగురు సభ్యులు ఉండగా ఈ సారి కుంటిమద్ది ఎంపీటీసీ సాయిలీల టీడీపీవైపు మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. ఆమె ఫోన్ పని చేయకపోవడం, గ్రామంలో అందుబాటులో లేకపోవడం, వైసీపీ క్యాంపులో కూడా లేకపోవడంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే ఆమె, ఆమె భర్త టీడీపీ వర్గీయులతో మాట్లాడి తాము టీడీపీకే మద్దతుగా నిలుస్తామని చెప్పినట్లు సమాచారం. అయితే టీడీపీ వర్గీయుల కూడా ఈ వార్తను ధ్రువీకరించడంలేదు. కుంటిమద్ది ఎంపీటీసీ టీడీపీకి మద్దతుగా నిలిస్తే ఎంపీపీ అభ్యర్థిగా నిలిచే అవకాశం ఉంటుంది. ఈనేపథ్యంలో గత ఎన్నికల మాదిరే వైసీపీ ఎన్నికలను బహిష్కరిస్తే ఎంపీపీ ఎన్నిక సులువుగా జరిగిపోతుంది. కానీ ఇప్పటికే వైసీపీ నాయకులు పోలీసుల రక్షణలో ఎన్నికలలో పాల్గొనాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం.


ఎన్నిక నిర్వహణపై సమీక్షిస్తున్న అధికారులు

పోలీసులు బందోబస్తు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వైసీపీకి చెందిన ఓ సభ్యుడు తనకు ఏ పార్టీ వద్దని అన్నారని, అలా జరిగితే ఇబ్బంది అవుతుందని ఆ సభ్యున్ని కూడా వైసీపీ క్యాంపు రాజకీయాలకు పంపినట్లు సమాచారం.

ఎంపీడీఓతో సమీక్షించిన పోలీసులు

రామగిరి ఎంపీపీ ఉప ఎన్నిక ఏర్పాట్లపై సీఐ శ్రీధర్, ఎస్ఐ సుధాకర్‌యాదవ్‌లు ఎంపీడీఓ గంగావతితో శనివారం సమీక్షించారు. ఈనెల11న ఎంపీపీ ఉప ఎన్నిక నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్ల గురించి చర్చించారు. ఎంపీటీసీలు 9 మంది ఉండగా ఇందులో ముగ్గురు టీడీపీ, ఆరుగురు వైసీపీకి చెందినవారు ఉన్నారు. ఇప్పటికే నాలుగు సార్లు ఎన్నికకు నోటిఫికేషన్ వచ్చి వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ సారైన ఎన్నికలు జరుగుతాయా అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

అప్పులకు అన్నదాతలు బలి

వేర్వేరుచోట్ల ఇద్దరు రైతుల ఆత్మహత్య


త్రివేంద్ర (ఫైల్)


గుర్రప్ప (ఫైల్)

గార్లదిన్నె/కళ్యాణదుర్గంరూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అప్పులకు జిల్లాలో ఇద్దరు అన్నదాతలు బలయ్యారు. గార్లదిన్నె మండలం కోటంక గ్రామంలో అప్పుల బాధ భరించలేక గోసుల గుర్రప్ప (79) శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాలు మేరకు.. గోసుల గుర్రప్ప, సుబ్బక్క దంపతులు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. వారికున్న 4.30 ఎకరాల భూమిలో చీనీ చెట్లు సాగుచేస్తున్నారు. మూడేళ్లుగా దిగుబడి రాలేదు. పంటల సాగుకోసం తెలిసిన వారివద్ద అప్పులు చేశారు. బోరుబావుల్లో నీరు ఇంకిపోవడంతో ఎండుతున్న చీనీ చెట్లను కాపాడుకునేందుకు 4 బోర్లు వేశారు. దీంతో అప్పులు రూ.8 లక్షలు దాటాయి. పంటలు దిగుబడి రాక, చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించలేదు. అప్పులు ఇచ్చిన వారు ఒత్తిడి చేయడంతో మనస్తాపం చెందిన గుర్రప్ప శనివారం చీనీచెట్లకు పిచికారీ చేసే పురుగుల మందును తన తోటలోనే తాగి, ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్తున్న గొర్రెల కాపర్లు గమనించి.. కుటుంబ సభ్యులకు, పోలీసులకు తెలియజేశారు. ఇంటి పెద్దదిక్కు కోల్పవడంతో ఆ కుటుంబ సభ్యులు బోరున విలపించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు. గుర్రప్పకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మంగళకుంటలో యువరైతు..

కళ్యాణదుర్గం మండలంలోని మంగళకుంట గ్రామంలో అప్పుల బాధతో యువరైతు కురుబ త్రివేంద్ర (30) శనివారం ఉరేసుకుని, ప్రాణం తీసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దాదాపు పదెకరాల పొలంలో మొక్కజొన్న, టమోటా, వేరుశనగ, మామిడి సాగు చేశాడు. పెట్టుబడుల కోసం రూ.పది లక్షల వరకు అప్పులు చేశాడు. దిగుబడులు రాక అప్పులు తీర్చే మార్గం కనిపించలేదు. తన తోటలోని చెట్టుకు లుంగీతో ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. త్రివేంద్ర తల్లి యశోదమ్మ, భార్య గంగోత్రి పని నిమిత్తం తోటలోకి వెళ్లగా.. చెట్టుకు వేలాడుతున్న త్రివేంద్రను చూసి బోరున విలపించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికలు వాయిదా

అనంతపురం అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని 18 ప్రాథమిక గొర్రెల సహకార సంఘాల ఎన్నికలు వాయిదా పడ్డాయి. తొలి విడతలో ఉమ్మడి జిల్లాలోని 55 ప్రాథమిక గొర్రెల సహకార సంఘాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఇందులో అనంత జిల్లాలో 25కిగాను 13 సంఘాలకు ఎన్నికలు జరగలేదు. శ్రీసత్యసాయి జిల్లాలో 30కిగాను 5 సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు. ఆయా సంఘాలకు తగిన రికార్డులు లేకపోవడం, ఇతర కారణాలతో ఎన్నికలు వాయిదా పడినట్లు పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.

డిగ్రీలో నలుగురు డీబార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ యూజీ పరిధిలో జరుగుతున్న డిగ్రీ 3, 5 సెమిస్టర్ పరీక్షలలో నలుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు ఎస్కేయూ పరీక్షల విభాగ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ రమణ శనివారం తెలిపారు. అనంతపురంలో ముగ్గురు, హిందూపురంలో ఒకరు కలిపి మొత్తం నలుగురు మాస్ కాపీయింగ్ పాల్పడుతుండటాన్ని గుర్తించి, డీబార్ చేసినట్లు తెలిపారు.

10న స్పాట్ అడ్మిషన్లు

జేఎన్‌టీయూ ఓటీపీఆర్ఐ డైరెక్టర్ సుబ్బారెడ్డి

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఓటీపీఆర్ఐలో ఎమ్మెస్సీ (ఫుడ్ టెక్నాలజీ) కోర్సులో కన్వీనర్ కోటా మిగులు సీట్లకు ఈనెల 10వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ఆచార్య సుబ్బారెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. పీజీసెట్-2025లో అర్హత సాధించకపోయినా, పరీక్ష రాయకున్నా అర్హులన్నారు. అడ్మిషన్ పొందిన వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదన్నారు. అర్హులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో 10వతేదీ ఉదయం 10 గంటలకు ఓటీపీఆర్ఐ డైరెక్టర్ కార్యాలయంలో హాజరు కావాలన్నారు.

టమోటా కిలో రూ.32

అనంతపురంరూరల్,డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో శనివారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.32తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.14తో, సరాసరిగా రూ.20తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1,125 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

అంతర్జాతీయ పోటీలకు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ పోటీలకు నరేష్ ఎంపికయ్యాడు. ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న నరేష్ ఇటీవల మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లో నిర్వహించిన జాతీయ పారా అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభ చాటాడు. ప్రథమ స్థానంలో నిలిచిన నరేష్‌ను ఆదివారం నుంచి దుబాయ్‌లో నిర్వహించే ఇంటర్నేషనల్ పారా అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేశారు. భారత్ తరఫున ప్రాతినిథ్యం వహించనున్నాడు. ఎస్ఎస్‌బీఎన్ కళాశాల కరస్పాండెంట్ పీఎల్ఎన్ రెడ్డి, ప్రెసిడెంట్ రమణారెడ్డి, కార్యదర్శి నిర్మలమ్మ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామమోహన్, పీడీ శ్రీనివాస్‌రెడ్డి, నరేష్‌కి ఆర్థిక సహాయం అందజేసి, అభినందనలు తెలిపారు.

జేఎన్‌టీయూలో సదస్సు


మాట్లాడుతున్న వీసీ సుదర్శనరావు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : జేఎన్‌టీయూలోని ఆర్యభట్టా ఆడిటోరియంలో శనివారం స్ట్రాటజిక్ రోడ్ మ్యాప్ ఫర్ ఇంప్రూవింగ్ ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్-2026 అనే అంశంపై సదస్సు జరిగింది. ఇందుకు ఏపీఎస్‌హెచ్ఈ కౌన్సిల్ వైస్ చైర్మన్ ఆచార్య విజయభాస్కర్, వీసీ ఆచార్య సుదర్శనరావు, ఏపీహెచ్ఎస్ఈ సభ్యులు అనిల్‌కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీసీ సుదర్శనరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను వివరిస్తూ యూనివర్శిటీ, అనుబంధ కళాశాలు మెరుగైన పనితీరు కనబరచాలన్నారు. ఆ పనితీరుతోనే ర్యాంకింగ్‌లను మెరుగుపరుచుకోవాలన్నారు. అనంతరం అధ్యాపకులు చేయాల్సిన క్రెడిట్స్‌ను, క్వాంటంతో భవిష్యత్తు అనే బ్రోచర్‌ను ఆవిష్కరించారు. యోగివేమన యూనివర్శిటీ ఉపకులపతి ఆచార్య రాజశేఖర్, ఐక్యూ డైరెక్టర్ ఆచార్య పద్మ సువర్ణ, చెన్నై ఐఐటీ ప్రొఫెసర్ రజనీష్‌కుమార్, కో-ఆర్డినేటర్లు ఆచార్య దిలీప్‌కుమార్, ఆచార్య నారాయణరెడ్డి, వీసీ ఓఎస్డీ దేవన్న, యూనివర్శిటీ డైరెక్టర్లు, కళాశాల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

విద్యార్థినులకు రక్షణ శక్తి యాప్

బాలికలందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

డీఎస్పీ మహబూబ్ బాషా

అనంతపురం వైద్యం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విపత్కర పరిస్థితులు, ఆపద సమయంలో విద్యార్థినులకు భద్రత, రక్షణ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా శక్తి యాప్‌ను రూపొందించిందని మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ మహబూబ్ బాషా సూచించారు. బాలికలందరూ ఫోన్లలో శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, వ్యక్తిగత వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. శనివారం ప్రభుత్వ వైద్యవిద్య కళాశాలలో మెడికల్, నర్సింగ్, పారామెడికల్ విద్యార్థినులకు శక్తియాప్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్ఎంఓ డాక్టర్ హేమలత అధ్యక్షత వహించిన సదస్సుకు సర్వజన వైద్యశాల సూపరింటెండెట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, డీఎస్పీ మహబూబ్ బాషా హాజరై, మాట్లాడారు. మహిళలు, చిన్నారులు, విద్యార్థుల రక్షణకు పోలీస్‌శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగా సైబర్ హెల్ప్‌లైన్ 1930, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, చిల్డ్రన్ హెల్ప్‌లైన్ 1098, అంబులెన్స్ 108, ఫైర్ సర్వీస్ 101, రోడ్డు యాక్సిడెంట్ 173, టూరిస్ట్ హెల్ప్‌లైన్ 1363, ఉమెన్ ట్రాఫికింగ్ హెల్ప్‌లైన్ 1091 నెంబర్లకు యాప్ ద్వారానే ఫోన్ చేయాలని సూచించారు. తద్వారా త్వరితగతిన సహాయం అందుతుందని వివరించారు. అనంతరం డీఎస్పీ మహబూబ్ బాషాను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్టాఫ్‌నర్స్ లత, భాగ్యరాణి, నరేష్, శోభ, కృష్ణవేణి, సరోజ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో డీఎస్పీ మహబూబ్ బాషా

మహిళా పక్షపాతి సీఎం చంద్రబాబు

- మంత్రి సవిత


చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు మహిళా పక్షపాతి అని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆమె స్వయం సహాయ సంఘాల మహిళలతో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. వివిధ పథకాల కింద 1974మంది లబ్ధిదారులకు స్త్రీనిధి రుణం కింద రూ.18.06కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. సామాజిక పెట్టుబడి, బ్యాంక్ లింకేజీ ద్వారా 1413మందికి రూ.138.46కోట్లు విడుదలయ్యాయి. సీడ్ క్యాపిటల్ పథకం కింద 141మందికి రూ.55.10లక్షలు, రైతు ఉత్పత్తిదారులకు రూ.1.03కోట్లు, ఎస్ఎస్‌సీఎస్ పథకం కింద 49మంది లబ్ధిదారులకు రూ.24.50లక్షలు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల బలోపేతానికి అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

బెల్టు తీయండి: ఎక్సైజ్ డీసీ


సీఐతో మాట్లాడుతున్న డీసీ నాగమద్దయ్య

ధర్మవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బెల్ట్‌షాపుల నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని అనంతపురం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. స్థానిక ఎక్సైజ్‌శాఖ కార్యాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనుమతులు లేకుండా కర్ణాటక మద్యం, నాటు సారా అమ్మడం, బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్సైజ్ ఏపీసురక్ష యాప్ ద్వారా ప్రతిషాపులో స్కాన్ చేసి మద్యం విక్రయాలు జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్, స్థానిక సీఐ చంద్రమణి, ఎస్ఐలు నాగరాజు, చాంద్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

పునరావృతమైతే జైలుకే

తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చి బైక్‌లు అప్పగించిన ఎస్పీ


హెచ్చరికలు జారీచేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

పెనుకొండ టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులపై వివిధ ప్రాంతాల్లో బైక్‌రైజింగ్‌లు, వీలింగ్ చేస్తే జైలుకేనని ఎస్పీ సతీష్‌కుమార్ బైక్ రైడర్లను హెచ్చరించారు. బుధవారం గంధం ఉరుసులో భాగంగా ద్విచక్రవాహనాల్లో పెనుకొండకు వచ్చిన యువత 44వ జాతీయరహదారిపై బైక్ విన్యాసాలు చేశారు. ఎస్పీ ప్రత్యేక బృందాలు పంపి 110 వాహనాలను సీజ్ చేయించారు. మూడు రోజుల అనంతరం శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ద్విచక్రవాహనాల్లో పట్టుబడిన వారి కుటుంబ సభ్యులను పిలిపించి వారి సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చి ద్విచక్రవాహనాల రికార్డులు పరిశీలించి అప్పగించారు. హెల్మెట్లు లేనివారికి సాధారణ ఫైన్లువేశారు. తల్లిదండ్రులు కూడా బాధ్యతాయుతంగా పిల్లల్ని పెంచాలని వాహనాలు తీసిచ్చే సమయంలో జాగ్రత్తలు చెప్పాలని సూచించారు. బైక్ రైజింగ్ (వీలింగ్) చేయడం చట్టరిత్యా నేరమని తెలిపారు. ఒక్కో బైక్‌కు రూ.5వేల నుంచి రూ.10వేలదాకా జరిమానా విధిస్తున్నట్లు తెలిపారు. మొదటిసారి జరిమానాతో సరిపెట్టామని ఇలాగే కొనసాగితే కేసులు నమోదుచేసి వాహనాలు తిరిగి ఇవ్వమని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ నర్సింగప్ప, సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పదింతల శ్రద్ధ

అనంతపురం విద్య, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచడానికి అధికారులు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం వంద రోజుల ప్రత్యేక ప్రణాళిక అమలు చేయనున్నారు. జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలు 356 ఉన్నాయి. ఇందులో 19616మంది పదో తరగతి చదువుతున్నారు. వీరిలో బాలురు 9311మంది, బాలికలు 10305మంది ఉన్నారు. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు టెన్త్ విద్యార్థులకు వంద రోజుల ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. సబ్జెక్టులవారిగా షెడ్యూల్ రూపొందించి విడుదల చేశారు. వచ్చే ఏడాది మార్చి 16నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. దీంతో వచ్చే మార్చి 15వరకు ప్రత్యేక ప్రణాళికకు షెడ్యూల్ తయారు చేశారు. ఆ మేరకు శనివారం నుంచి టెన్త్ 100 రోజుల ప్రణాళికకు శ్రీకారం చుట్టారు. ఉదయం 8 నుంచి 9గంటల వరకు, మధ్నాహ్నం 2-30 నుంచి 4గంటల వరకు చదివించడం, ఆతర్వాత ఆ సబ్జెక్టుకు సంబంధించిన పరీక్షను సాయంత్రం 4 నుంచి 5గంటలలోగా నిర్వహించాలి. అక్కడే ఆ జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి, ఎవరెవరికి ఎన్ని మార్కులు వచ్చాయో కూడా లీప్‌యాప్‌లో సాయంత్రం 5గంటలలోపే నమోదు చేయాలి.

పర్యవేక్షణకు కమిటీలు

పదో తరగతి వందరోజుల ప్రత్యేక ప్రణాళిక సక్రమంగా అమలు జరగడం కోసం పర్యవేక్షణకు జిల్లా, మండల స్థాయి అకడమిక్ ఫోరమ్స్ ఏర్పాటు చేశారు. ఆయా సబ్జెక్టు టీచర్లతో వీటిని ఏర్పాటు చేశారు. ఇలా ప్రతి సబ్జెక్టుకు నలుగురు టీచర్లు చొప్పున జిల్లా, మండలస్థాయి కమిటీలు ఏర్పాటు చేశారు. ఈకమిటీ సభ్యులు వారానికి రెండు రోజులు పాటు జిల్లాలో పర్యటిస్తూ ఉన్నత పాఠశాలలో ప్రణాళిక అమలు తీరు, విద్యార్థుల ప్రగతిపై అంచనా వేస్తూ, ఫలితాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు అందిస్తారు. ఈ నేపథ్యంలో పర్యవేక్షణ ఫోరమ్ కమిటీసభ్యులకు జిల్లాకేంద్రంలోని ఉపాధ్యాయభవన్‌లో జిల్లా పరీక్షల విభాగం ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించి, అవగాహన కల్పించారు. ఉత్తమ ఫలితాల సాధనకు తీసుకోవాల్సిన చర్యల గురించి డీఈఓ ప్రసాద్‌బాబు, డిప్యూటీ డీఈఓలు మల్లారెడ్డి, శ్రీనివాసరావులు హితబోధచేశారు. పరీక్షల విభాగాధిపతి వెంకటేశులు, డీసీఈబీ సెక్రటరీ గంధం శ్రీనివాసులు, ఎంఈఓలు క్రిష్టయ్య, గురుప్రసాద్, రామాంజినేయులు, ఏఎంఓ వేణుగోపాల్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

చో రామస్వామి (వర్ధంతి)



తమిళ సినీరంగంలో నటుడు, కమెడియన్, క్యారెక్టర్ ఆర్టిస్ట్, ప్లే రైట్, డైలాగ్ రైటర్‌గానే కాక రాజకీయ విమర్శకులు, న్యాయ వాదిగా బహుముఖ ప్రజ్ఞాశాలి. నాటకంలోని ఒక పాత్ర ద్వారా పేరొందిన శ్రీనివాస అయ్యర్ రామస్వామి 1934 అక్టోబరు 5న తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని మైలాపూర్ ప్రాంతంలో జన్మించారు. దెన్‌మొళియల్ నాటకాన్ని రాసి అందులో 'చో' పాత్ర తో ప్రేక్షకులను రక్తి కట్టించడంతో 'చో రామస్వామి'గా పేరొందారు. నాలుగు దశాబ్దాలలో 180 సినిమాలలో నటించగా 5 సినిమాలకు దర్శకత్వం వహించారు. అప్పట్లో ప్రముఖ నటులందరితోనూ నటించారు. కాగా 20 నాటకాలను రచించి దర్శకత్వం వహించారు. 'తుగ్లక్' పత్రిక సంస్థాపకులు, ఎడిటర్. 1999లో రాజ్యసభకు నామినేట్ అయ్యారు. 2016 డిసెంబరు 7న కన్నుమూశారు. సాహిత్యం, విద్య, జర్నలిజంలలో సేవలకుగాను మరణానంతరం 'పద్మభూషణ్' ప్రకటించారు.

ఎల్‌ఆర్ ఈశ్వరి (పుట్టినరోజు)



ప్రముఖ నేపథ్యగాయని ఎల్‌ఆర్ ఈశ్వరి 1939 డిసెంబరు 7న చెన్నై లో జన్మించారు. గాయనిగా వేలాది పాటలు పాడారు. తమిళ, తెలుగు, మళయాళం, కన్నడ, హిందీ, తుళు, ఆంగ్లంతోపాటు మొత్తం 14 భాషలలో సోలో, డ్యూయెట్ పాటలు ఆలపించారు. జానపదమైనా, భక్తి పాట అయినా అలవోకగా ఆల పించడం ప్రత్యేకం. ప్రత్యేకించి జానపదం, క్లబ్ డ్యాన్సుల పాటలతో పేరొందారు. కలైమామణి, తదితర పురస్కారాలు పొందారు.

తిరుమల పాదయాత్రికులకు నిత్యావసరాలు

చిలమత్తూరు, డిశంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతికి పాదయాత్ర చేస్తున్న యాత్రికులకు టీడీపీ నాయకులు లక్ష్మీనారాయణయాదవ్ నిత్యావసరాలను అందజేశారు. పాదయాత్రగా వందలమంది శనివారం చిలమత్తూరు నుంచి తిరుమలకు బయలుదేరారు. ఈ సందర్భంగా వారికి భోజనం కోసం అవసరమయ్యే నిత్యావసరాలను ఆయన అందజేశారు.

రైలు కింద పడి వృద్ధుడి ఆత్మహత్య

హిందూపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కిరికెర సమీ పంలో రైలుకిందపడి మోదాకు చెందిన నారాయ ణప్ప(70) ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతు న్నాడు. శనివారం ఉదయం ఇంటి నుంచి బయటికి వచ్చాక రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. గూడ్స్ లోకోపైలెట్ అందించిన సమాచారంతో రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహం వద్ద మొబై ల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులుగుర్తించాక మృతదే హాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

దేవుడి సేవకు సమయం కేటాయిద్దాం: చైర్మన్

హిందూపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తి కొంత సమయాన్ని దేవుని సేవకు కేటాయించాలని మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే పీఏ వీర య్య అన్నారు. శనివారం పట్టణంలోని పేట వెంకటరమణ స్వామి ఆలయం నుంచి పాదయాత్ర బృందం తిరుమ లకు ప్రారంభమైంది. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ భక్తిశ్రద్ధలతో ఏడు రోజులపాటు కాలినడకన తిరుమలకు చేరుకోనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు వెంకటేష్, రూరల్ మండల కన్వీ నర్ రాము, మంగేష్, నెట్టప్ప, ఎన్‌బీకే రాజు, అమర్నాథ్, బాచి తదితరులు పాల్గొన్నారు.

గుడిబండకు కృష్ణాజలాలు



గుడిబండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాలు గుడిబండ మండలానికి చేరాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సీం నారాచంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారాలోకేష్, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి చొరవతో కృష్ణ జలాలు గుడిబండ మండలం మీదుగా అమరాపురం చెరువుకు కాలువ ద్వారా వెళ్తున్నాయని, వారికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా అంజన్న ఉత్సవాలు

అమరాపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల పరి ధిలోని కళారాజనపల్లి గ్రామ సమీపంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో హారతి ఉత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారి విగ్ర హానికి ఆలయ అర్చకులు తెల్లవారుజామున సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం హోమాది కార్యక్రమాలను నిర్వహించారు. కళారాజనపల్లి గ్రామం నుంచి మహి ళలు హారతి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు.



అంబేడ్కర్ ఆశయాలు అనుసరణీయం

» రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి



అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న చిన్నారులు

దొమ్మసంద్ర, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాలు నేటికీ అనుసరణీయమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవా ట్రస్టు అధ్యక్షులు వై శ్రీరాములు తెలిపారు. సర్జాపుర పట్టణంలోని అంబేడ్కర్ క్రీడా మైదానంలో శనివారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. 69వ పరినిర్వాణ దినం సందర్భంగా పలువులు ప్రసంగించారు. అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం కేవలం లా పుస్తకం కాదని అది సామాజిక న్యాయంగా ఉందన్నారు. అందరికీ సమానత్వం, స్వాతంత్ర్యం, హక్కులు, బాధ్యతలు అందేలా రూపొందించారన్నారు. సర్జాపుర గ్రామ పంచాయతీ మాజీ అధ్యక్షుడు ఎస్‌వై శంభయ్య మాట్లాడుతూ రానున్నరోజుల్లో ట్రస్టు తరపున విద్య, సమాజసేవ, రాజ్యాంగ విలువలను నేర్పే కార్యక్రమాలు చేరువయ్యేలా నిర్వహిస్తామన్నారు. విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ట్రస్టు సంస్థాపక అధ్యక్షులు జీ మునియప్ప, కోశాధికారి ఏ సతీశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎం మూర్తికుమార్, పదాధి కారులు శంభయ్య, నాగరాజు, ఎంసీ హళ్ళి వేణు, గుట్టహళ్ళి శ్రీనివాస్, రామకృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం కార్యాలయంలో...

బాగేపల్లి(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పరినిర్వాణ కార్యక్రమం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలోనూ శనివారం నిర్వహించారు. సుందరయ్య భవనంలో ఏర్పాటైన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సీపీఎం నాయకుడు మునివెంకటప్ప మాట్లాడుతూ అంబేడ్కర్ తన జీవితంలో ఎన్నో ఒడిదు డుకులు ఎదుర్కొన్నారన్నారు. సమాజంలో అసమానతలు తొలగేందుకు ఎంతో కృషి చేశారన్నారు. రాజ్యాంగం ద్వారా అన్నివర్గాల ప్రజలకు మేలు చేకూరేలా చర్యలు చేపట్టారన్నారు. అంబడ్కేర్ ఆశయాలు నేటికీ అనుసరణీయమన్నారు. సీపీఎం నాయకులు చన్నరాయప్ప, రఘురామరెడ్డి, కృష్ణప్ప, నాగరాజు, మునియప్ప, ముస్తఫా, జీ కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య భవనంలో..

ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ నిరసన



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

చింతామణి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఖండిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం భారీ నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ సుదర్శన్ యాదవ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆజాద్‌చౌక్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు గుమిగూడారు. కాంగ్రెస్ వైఫల్యా లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రగౌడ మాట్లాడుతూ రాష్ట్రంలో పాలన పూర్తిగా విఫలమైందన్నారు. ముఖ్యమంత్రి కుర్చీకోసం నేతలు తగవుపడుతూ కాలం వృథా అవుతోందన్నారు. ప్రతిరోజూ మీడియాలో ఇవే కథనాలు సీరియల్స్‌గా వస్తున్నాయన్నారు. రైతులు ఎదుర్కొం టున్న సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ఐదుగ్యారెంటీలు అమలు చేస్తున్నా మంటూ ఖజానాను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. పేదలు, మధ్య తరగతి వర్గాలకు 10 రూపాయలు ఇచ్చి, పన్నులు విపరీతంగా పెంచి రూ.100 లాక్కుంటున్నారని ఇటువంటి ప్రభుత్వం అవసరమా అని ప్రశ్నించారు. నిరసనలో బీజేపీ తాలూకా నాయకుడు జీఎస్ వేణుగోపాల్, కేఎం రాజశేఖర్ రెడ్డి, అరుణ్‌బాబు, తాజా మాజీ అధ్యక్షుడు మహేశ్‌బై, పట్టణ అధ్యక్షుడు గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయం కూల్చివేత



గంగమ్మదేవికి ప్రత్యేకపూజలు



ఆలయాన్ని తొలగిస్తున్న దృశ్య

శిడ్లఘట్ట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట తాలూకా తుమ్మనహళ్ళి గ్రామపంచాయతీ పరిధి సొరకాయలహళ్ళిలో కొలువైన గ్రామదేవత గంగమ్మ దేవాలయం శిథిలావస్థకు చేరింది. సొర కాయలహళ్ళి వాసులు కలసికట్టుగా ఆలయాన్ని పునఃనిర్మించాలని నిర్ణయించారు. గ్రామస్తులు ప్రత్యేకంగా సమావేశమై పాడుబడిన ఆలయాన్ని పున రుద్ధరణ చేయాలని చర్చించారు. గ్రామస్తు లంతా ఏకాభిప్రాయంతో ఉన్న ఆలయాన్ని పూర్తిగా తొలగించి కొత్తగా సకల సౌలభ్యాలతో నిర్మిద్దామని తీర్మానించారు. ఈ మేరకు ఆల యా న్ని శాస్త్రాలకు అనుగుణంగా తొలగిం చాలని ప్రత్యేక పూజలు జరిపారు. శనివారం ఉదయం గంగమ్మదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ భవనాన్ని తొలగించే ప్రక్రియ చేపట్టారు. పొక్లైనర్‌ల సాయంతో ఆలయాన్ని తొలగించారు. మూలవిరాట్టుకు భంగం కాకుండా తగిన చర్యలు చేపట్టారు.

బరితెగిస్తున్న బైక్ వీలర్స్

● హైవేపై ప్రమాదకర విన్యాసాలు



రెచ్చిపోతున్న యువతీయువకులు ● కత్తులతో రోడ్డుపై నిప్పురవ్వలు రేపుతున్న వైనం ● ఇబ్బంది పడుతున్న వాహనదారులు

సోమందేపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బైకర్స్ బరితెగిస్తున్నారు. హైవేపై ప్రమాదకర విన్యాసాలు చేస్తూ వాహనదారులను బెంబేలెత్తిస్తు న్నారు. ముందు చక్రాన్ని గాల్లోకి లేపి యువకులు బైకు నడుపుతుండగా, వెనుక కూర్చున్న యువతులు కత్తులు తీసి వెనక్కు వంగి దాన్ని రోడ్డుపై రాపాడిస్తూ నిప్పురవ్వలు రేగేలా చేస్తున్నారు. మూడు రోజుల కిందట పెను కొండ సమీపంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వీడియో ఇన్‌స్టా గ్రామ్‌లో వైరల్‌గా మారింది.

పెనుకొండ, సోమందేపల్లి మధ్యలో...

ప్రస్తుతం పెనుకొండలో బాబయ్య ఉరుసు జరుగుతోంది. ఈనెల 2న గంధం వేడుకలను వీక్షించడానికి సుదూర ప్రాంతాల నుంచి వేలమంది భక్తులు తరలివచ్చారు. వీరితోపాటు పలువురు ఆకతాయిలు కూడా వచ్చారు. సోమందేపల్లి నుంచి పెనుకొండ వరకు జాతీయరహదారిపై వీలింగ్ చేస్తున్న 106మందిని పోలీసులు పట్టుకుని, వాహనాలను సీజ్‌చే శారు. అయితే అదేరోజు రాత్రి చిక్కబళ్లాపురం, గౌరీబిదునూరుకు చెందిన కొన్ని జంటలు పెనుకొండ, సోమందేపల్లి మధ్యలో ఒళ్లు గగుర్పొడిచే రీతిలో బైక్ విన్యాసాలు చేశారు. చేతుల్లో కత్తులు పట్టుకుని హల్‌చల్ చేశారు. వారి విన్యాసాలను బ్యాచ్ సభ్యులు వీడియోతీసి, రీల్స్‌గా మలిచి ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. ఈ వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ బ్యాచ్‌లో ఉన్న గౌరీబిదునూరు, చిక్కబళ్లాపురం ప్రాంతాలకు చెందిన యువతులను గుర్తిం చారు. వీరు ఆరోజు రాత్రి పోలీసుల కన్నుగప్పి తప్పించుకున్నట్లు పట్టుబడి నవారు చెబుతున్నారు.

ప్రజలు బలి



డీఎస్పీ కార్యాలయంలో ఉంచిన సీజ్‌చేసిన బైక్‌లు

బైక్ వీలర్స్ చేసే పనుల వల్ల సాధారణ ప్రజలు కూడా మూల్యం చెల్లించు కోవాల్సి వస్తోంది. పెనుకొండ బాబయ్య దర్గాలో పూజలు చేయడానికి వివిధ ప్రాంతాల నుంచి ద్విచక్రవాహనాల్లో వస్తున్న యువకులను పోలీసులు సోమందేపల్లి వద్ద ఆపి, వారి వాహనాలను సీజ్ చేశారు. దీంతో పలువురు ఉపాధిచ ఉద్యోగాలు కోల్పోవాల్సి వచ్చిందని బాధితులు దాదు, ఆసిఫ్, అర్షద్, జమీర్, ఆజాద్, ముజ్జు, పర్వీన్, షేక్‌బాబు తదితరులు తెలిపారు. బెంగళూరులో మెడికల్ రెప్‌గా పనిచేస్తున్న యువకుడు మూడు రోజుల కిందట దర్గాకు వచ్చి, పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడు. బైకు లేక ఉద్యోగా నికి వెళ్లకపోవడంతో సోమవారంలోగా విధులకు రాకపోతే తొలగిస్తామని మెయిల్ పంపినట్లు వాపోయాడు. కియ పరిశ్రమలో కారు అసెంబుల్ విభా గంలో పని చేసే గోరంట్లకు చెందిన యువకుడు నైట్ షిఫ్ట్ విధులు ముగిం చుకుని స్వగ్రామానికి వెళ్తుండగా వీలర్ అనే అనుమానంతో సోమందేపల్లి వద్ద అతడి బైక్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఇలా డ్రైవర్లు, మెకానిక్‌లు, విద్యార్థులు, వెల్డర్లు, వ్యాపారులు అనేక మంది బైక్‌లను సీజ్ చేసినట్లు బాధి తులు ఆవేదన వ్యక్తం చేశారు. వీలింగ్‌చేస్తున్న వారు పది నుంచి 20మంది ఉండగా వారితోపాటు 80మంది ద్విచక్రవాహనాలను పోలీసులు సీజ్ చేసి నట్లు సమాచారం. గత ఏడాది వీలింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు గుర య్యారు. దీంతో ఈఏడాది పోలీసులు కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. డీఎస్పీ కార్యాలయంలో పట్టుబడిన వాహనదారులకు జరి మానా విధించి శనివారం వదిలిపెట్టారు.

పూర్తిస్థాయిలో నియంత్రించలేం

వీలర్స్‌ను పూర్తి స్థాయిలో నియంత్రించడం సాధ్యం కాదు. ఇది నిరంతరం చేపట్టాల్సిన ప్రక్రియ. పెనుకొండలోనే కాకుండా అన్నిచోట్ల వీలర్స్‌ను అడ్డు కోవాల్సిన అవసరం ఉంది. తల్లిదండ్రులు సైతం తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారిని కట్టడి చేయాలి. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలను నేను నమ్మను. అవి సబ్‌స్క్రైబ్స్‌ను పెంచుకోవ డానికి ఎక్కడో జరిగిన సంఘటనలు తీసుకొచ్చి ఇక్కడ జరిగినట్లు చూపుతుంటారు. బెంగ ళూరు దగ్గరగా ఉండటంతో సాఫ్ట్‌వేర్ ఉద్యో గులు స్పోర్ట్స్‌బైక్‌లలో పెనుకొండకు ఎక్కువగా వస్తుంటారన్నారు. మేము వీలర్స్, రైడర్స్‌ను కట్టడి చేసేలా కృషి చేస్తాం.

- సీఐ రాఘవన్

ఆర్కిటెక్ట్‌ల ప్రత్యేక సదస్సు



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

బెంగళూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జపాన్ దేశానికి ప్రముఖ ఆర్కిటెక్ట్ సంస్థ అకీహీస హిరాటా సహకారంతో టోటో ఇండియా సంస్థ ఆధ్వర్యంలో బెంగళూరులో ప్రత్యేక చర్చాగోష్టి నిర్వహించారు. ఆర్కిటెక్ట్‌లను ప్రోత్సహించే విధంగా పలు చర్చలు సాగినట్టు టోటో ఇండియా పేర్కొంది. విన్యాసం, సంస్కృతి, ఆవిష్కారాల నడుమ ప్రజలకు అవసరమైన రీతిలో నమూనాలు రూపొందించాలని వక్తలు పేర్కొన్నారు. ఆధునికతకు అను గుణంగా బయోలాజికల్ స్ట్రక్చర్స్‌పై దృష్టి సారించాల్సి ఉందన్నారు. అకీహీసా హిరాటా తరఫున వాటర్స్ ఎడ్జ్ ఆఫ్ ది హ్యూమన్ గురించి చర్చించారు. వెనిస్ బైయెన్నియల్‌లో గోల్డెన్ లయన్ విజేత అకీహీసా హిరాటాసాన్, పరికల్పనలను సాకారం చేసేలా ఆర్కిటెక్ట్‌లు కృషి చేస్తున్నారు. టోటో ఇండియా నేతృత్వంలో భారతీయ మార్కెట్‌లో బ్రాండ్ సాధించేందుకు ముం దుకు సాగుతున్నట్టు పేర్కొన్నారు. సృజనాత్మతకతకు ప్రాధాన్యత ఇస్తూ ఏడాదికి సుమారు రూ.500 కోట్లు టర్నోవర్ లక్ష్యం కలిగినట్టు తెలిపారు.

ఉత్సాహంగా మిడ్‌నైట్ మారథాన్



మారథాన్‌కు పచ్చజెండా ఊపుతున్న ఎమ్మెల్యే మంజుల

మహదేవపుర, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నిత్యం ఒత్తిడితో సాగే ఐటీ ఉద్యోగులు తమ ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలనే ఉద్దేశ్యంతో మారథాన్ వంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక చైతన్యం సాధ్యమని ఎమ్మెల్యే మంజులా లింబావళి అభిప్రాయపడ్డారు. రోటరీ ఐటీ బెంగళూరు ఆధ్వర్యంలో 18వ మిడ్‌నైట్ మారథాన్ వైట్‌ఫీల్డ్ కేటీపీఓ మైదానంలో శనివారం సాయంత్రం ప్రారంభమైంది. మారథాన్‌కు ఎమ్మెల్యే పచ్చజెండా చూపారు. వివిధ విభాగాలలో 12వేలమందికిపైగా రన్నర్‌లు పాల్గొన్నారు. మారథాన్‌కోసం ట్రాఫిక్‌ను మళ్లించారు. రాత్రివేళ మారథాన్ కోసం ట్రాఫిక్ పోలీసులు, వలంటీర్లు పనిచేశారు. రోటరీ ఐటీ బెంగళూరు ఆధ్వర్యంలో విజేతలకు ప్రమాణపత్రాలతోపాటు ఆరోగ్య సంబంధ జాగృతి సందేశాలు చేశారు.

వాహనాలు తనిఖీ చేసిన పోలీసులు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

బళ్లారిరూరల్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి) : విజయనగర జిల్లా హంపి తదితర పుణ్య క్షేత్రాలకు వెళ్లే రహదారుల్లో ఎస్పీ జాన్వి ఆదేశాలతో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అనుమానాస్పద వాహనాలను చెక్ పోస్టుల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా హంపి ట్రాఫిక్ పోలీసులు కడ్డీ రాంపురం చెక్‌పోస్టు కోటే ఆంజనేయ చెక్ పోస్టుల వద్ద వాహనాలను పోలీసు ఉన్న తాధికారుల ఆదేశాలతో వాహనాల్లో మత్తు పదార్థాలు మందు పదార్థాలు దేవస్థానం వెళ్లే వాహనాలలో పోలీసు అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేసి కడ్డి రాంపురం, ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం, హంపి ఎస్‌ఐ శివకుమార్ నేతృత్వంలో అనుమానా స్పద వాహనాలు విస్తృతంగా వాహనాలు తనిఖీలు నిర్వహించారు.

నేడు మహాదేవతాత వర్ధంతి



కంప్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కంప్లి తాలుకా పరిధిలోని మెట్రి గ్రామంలో శ్రీ విశ్వారాధ్య గురుకుల మఠం వ్యవస్థాపకుడు హంద్యాల్ మఠం మహాదేవతాత 42వ వర్ధంతి (పుణ్యస్మరణ) ఆదివారం జరుపు కుంటున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం వివిధ పూజా కార్యక్రమాలు చేప డుతున్నట్లు తెలిపారు. అంతకుముందు గౌరమ్మ, మహాదేవతాత గర్భగుడిలో ప్రణవ జ్యోతి పంచాచార్యులు మహామూర్తులకు ప్రత్యేక జలాభిషేకం, అమృతాభిషేకం, రుద్రాభిషేకం, గణారాధన, తదితర పూజలు నిర్వహిస్తారు. ఎమ్మిగనూరు వామదేవ మహంత్ శివాచార్యులు, బుక్కసాగర, విశ్వారాధ్య శివాచార్యులు, హరిగిణదోణి అభినవ సిద్దలింగ శివా చార్యులు పాల్గొంటారని తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

కంప్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ సర్కిల్‌లో ఏర్పాటు చేసే వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపన జనవరి 3న వైభవంగా జరుపుకుందామని, పలువురు జిల్లా వాల్మీకి సమాజం నాయకులు తెలిపారు. శనివారం కంప్లి పట్టణంలో ఎమ్మెల్యే గణేష్ కలిసి ఆయన సన్మానించి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ కంప్లి నియోజకవర్గంలో కంప్లి కురుగోడు తాలుకాల నుండి వాల్మీకి సమాజం పదాధికారులు విగ్రహ ప్రతిష్ఠాపనలో అధికంగా పాల్గొనేలా చేపడుతామని తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1621.98	1629.56
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	617	3,332
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	9,230	5,254
నీటి నిల్వ (టీఎంసీలు)	67.05	92.42

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

కంప్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కంప్లి పట్టణం షుగర్ ఫ్యాక్టరీలో వెలిసిన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయ ఆలయం 17వ వార్షికోత్సవాన్ని మారుతి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి జలాభిషేకం, అమృతాభిషేకం, ఆకుపూజ, తులసి, పూజ పుష్పాలతో అలంకరణ చేపట్టారు. అనంతరం పూజలో పాల్గొన్న అన్నప్రసాదాలు కల్పించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.



అలంకరణలో హనుమంతుడు

దేవదాసీ వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలి

● జిల్లా లీగల్ అథారిటీ చైర్‌పర్సన్ కేజీ శాంతి పిలుపు ● విజయవంతంగా న్యాయ అవగాహన సదస్సు



మాట్లాడుతున్నన్యాయాధికారి శాంతి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న అధికారులు

బళ్లారి సిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సమాజంలో దుష్టవ్యవస్థ అయిన దేవదాసీ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించడానికి, దివ్యాంగుల అభ్యున్నతికి అందరూ చేతులు కలపాలని జిల్లాలీగల్ అథారిటీ చైర్మన్ కేజీ శాంతి అన్నారు. జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ, జిల్లాన్యాయ సేవల ప్రాదికార సంస్థ, మహిళా శిశు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని జిల్లాపంచాయతీ ఆడిటోరియంలో దేవదాసిలు, దివ్యాంగులకు న్యాయ అవగాహన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో దేవదాసి వ్యవస్థ ఇప్పటికీ ప్రబలంగా ఉండటం విచారకరమన్నారు. అభివృద్ధి చెందుతున్న అదే మూఢనమ్మకాన్ని అవలంభించడం సరి కాదన్నారు. దేడుని పేరుతో ఆచరిస్తున్న ఈ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యలేకపోవడం వల్ల అమాయకులు చంపడుతున్నారు. ఈ దుష్ట ఆచారాన్ని నిర్మూలించడానికి ప్రభుత్వం అనేక చట్టాలను అమలు చేసిందని, కానీ ప్రజల్లో అవగాహన లోపంతో కొనసాగడం విచారకరమన్నారు. దీని గురించి మరింత అవగాహన కల్పించాలన్నారు. మాజీ దేవదాసీలకు ప్రభుత్వ సౌకర్యాలు అందకపోతే, వారు జిల్లా న్యాయసేవల అథారిటీ నుంచి సహాయం పొందవచ్చన్నారు. దేవదాసి అంటే దేవతలకు సేవ చేసే సమాజం. వారు అజ్ఞానులు, ఆర్థికంగా వెనుకబడినవారు అవకాశాలు కోల్పోయినవారు. తరతరాలుగా దోపిడికీ గురైనవారు. అచంచలమైన విశ్వాసంయతో తమ గుర్తింపును కోల్పోయినవారు. జీవితాంతం ఆలయంలో దేవత పూజ, సేవకు తనను తాను అంకితం చేసుకున్న అమ్మాయికి దేవదాసీ అని పేరు. దేవతలకు సేవ చేయడానికి మహిళలు దేవాలయాలకు అంకితం చేయబడినప్పటికీ ఆచరణలో వారు లైంగిక దోపడి, సామాజిక హింసకు గురవుతున్నారని దేవదాసీ వ్యవస్థ నేపథ్యం గురించి వివరించారు. దేవదాసీలకు ప్రభుత్వ సౌకర్యాలు, పునరావాస పథకం, నెలవారీ భత్యం, విద్య, శిక్షణ,స్వయం ఉపాధి సౌకర్యం, హెల్త్‌కిట్‌లు అందిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులు ప్రత్యేక వ్యక్తులు వారుసమాజంలో ఒక భాగం. వారిని ప్రోత్సహించి వివిధ కార్యకలాపాల్లో పాల్గొనడానికి అనుమతించాలన్నారు. వారికి మెరుగౌన సౌకర్యం కలిగించాలని జిల్లాకలెక్టర్ తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 2.91శాతం మంది దివ్యాంగులు ఉండగా రాష్ట్రంలో 1.8శాతం మంది ఉన్నారు. ప్రభుత్వం దివ్యాంగులకు ఎన్నో సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. కలెక్టర్ నాగ్రేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ దేవదాసీ వ్యవస్థ ఒక సామాజిక అన్యాయమని, ఈ వ్యవస్థను ఇక్కడే ముగించి వారు అందమైన జీవితాన్ని గడపడానికి ప్రభుత్వం సౌకర్యాలను పొందాలన్నారు.



నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

పాఠశాలలను కాపాడాలి

● మూసివేత నిర్ణయంపై ఏఐడీఎస్ఓ ఆందోళన

బళ్లారి సిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని బాపూజీ నగర్ ప్రభుత్వ పాఠశాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులు శనివారం పాఠశాల ముందు ఏఐడీఎస్ఓ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. నిరసను ఉద్దేశించి ఏఐడీఎస్ఓ జిల్లా ఉపాధ్యక్షురాలు శాంతి మాట్లాడుతూ కేపీఎస్ మాగ్నెట్ స్కూల్‌ను ఆంధ్రాల్ స్కూల్‌కు పంపడానికి ప్రజలు అంగీకరించరన్నారు. పేదలు, కార్మికులు వారు తమ పిల్లలను రోజంతా ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవడానికి వదిలివేస్తారు. ఈ చిన్నపిల్లలు కేపీఎస్ మాగ్నెట్ స్కూల్‌కు వెళ్లడానికి ఒక కిలోమీటరు దూరంలో ఉన్న ఆంధ్రాళ్ స్కూల్‌కు వెళ్లరు. కాబట్టి 250 మందికి పైగా ఉన్న ఈ పాఠశాల విద్యకు అధిక ప్రాదాన్యత ఇవ్వాలన్నారు. బాపూజీనగర్ స్కూల్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ మూసివేయకూడదు. కాబట్టి ఏఐడీఎస్ బాపూజీ నగర్ తల్లిదండ్రులు పాఠశాలను కాపాడి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కర్ణాటక రాష్ట్రంలో 40వేలకుపైగా ప్రభుత్వ పాఠశాలలను మూసివేయబోతున్న రాష్ట్రప్రభుత్వం ముందుకు సాగుతోంది. తల్లిదండ్రులు, విద్యార్థులు ఒక ప్రజా కమిటీని ఏర్పాటుచేసి కలిసి వచ్చి ఉద్యమాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఏఐడీఎస్ఓ జిల్లా కార్యదర్శి కంబలి మంజునాథ్, జిల్లా కమిటీ సభ్యులు తిప్పేస్వామి,కాంతేశ్, బాపూజీనగర్ ప్రజలు ,విద్యార్థులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

14 వరకు హస్తకళల ప్రదర్శన



హస్తకళల ప్రదర్శనను ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ ఆకృతిశెట్టి

హోసూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హోసూరులో హస్తకళల ప్రదర్శనను సబ్ కలెక్టర్ ఆకృతిశెట్టి ప్రారంభించారు. సేలం భూంబుగారు సేల్స్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రదర్శన ఏర్పాటైంది. చేనేత వస్త్రాలు, దుస్తులు, అలంకరణ ఆభరణాలు వంటివి ఇక్కడ లభించనున్నాయి. ఈనెల 14వ తేది వరకు రైల్వే రోడ్డులోని మీరామహల్‌లో ప్రదర్శన కొనసాగనుంది. ప్రదర్శన మేనేజర్ నరేంద్రబోస్ మాట్లాడుతూ స్వామి మాల, పంచలోహ విగ్రహాలు, నాచ్చియార్ ఆలయం ఇత్తడి దీపాలు, తంజావూరు ఆర్ట్ శిల్పాలు, గంధపు వస్తువులు, కలప వస్తువులు, వివిధ రకాల దీపాలు, నలుపు, తెలుపు రంగుల అలంకరణ సామగ్రి, చన్నపట్టణ బొమ్మలు, హస్తకళాశిల్పాలు, ఇతర వస్తువులు, చేనేత దుస్తులు, సంచులు, రంగురంగుల ప్రింటెడ్ చీరలు, ఫ్యాన్సి చీరలు, హ్యాండ్‌బ్యాగులు, మొదలైనవి కూడా వున్నాయన్నారు. ప్రదర్శనలో కనీసం రూ.50 నుంచి 65 వేలు వరకు విలువైన హస్తకళా వస్తువులు అందుబాటులో ఉన్నాయన్నారు. అమ్మకాల లక్ష్యం రూ.10 లక్షలుగా ఉందని, అన్ని వస్తువులపై ప్రత్యేక 10 శాతం తగ్గింపు ఉందన్నారు. అన్ని క్రెడిట్ కార్డులకు సర్వీస్ ఛార్జీలు లేవన్నారు. అధికారులు శివగామి సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న విడుదలై చిరుత పార్టీ నాయకులు

హోసూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళులు అర్పించారు. హోసూరు బస్టాండు వద్ద శనివారం హోసూరు నియోజకవర్గ విడుదలై చిరుత పార్టీ సభ్యులు పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఇదే సందర్భంగా తిరుపరంగుండ్రం మురుగన్ ఆలయ సమస్యను నిరసిస్తూ కొబ్బరికాయలపై కర్పూరం అంటించి మురుగ మురుగ అంటూ కొట్టారు. ప్రధాని మోదీకి మంచి బుద్ధి ఇవ్వాలని, మదురైలో ఎయిమ్స్ ఆసుపత్రి నిర్మాణానికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. తమిళనాడు హిందువులకు పూర్తి విద్యానిధులు అందించాలని కేంద్ర ప్రభుత్వానికి సలహ ఇవ్వాలని దేవుడిని ప్రార్థించారు. నిరసనలో హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ జిల్లా కార్యదర్శి రామచంద్రన్ అధ్యక్షత వహించారు. హోసూరు మున్సిపాల్ డిప్యూటీ మేయర్ ఆనందయ్య, విడుదలై చిరుత పార్లమెంటరీ నియోజకవర్గ కార్యిదర్శి సెందమిళ్, ముత్తుకుమార్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో...



హోసూరు ప్రాంతీయ అభివృద్ధి కార్యాలయం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కొత్తగా నిర్మించిన తాత్కాలిక షెడ్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కృష్ణగిరి పశ్చిమ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నారాయణన్, జిల్లా మాజీ అధ్యక్షుడు నాగరాజు, జిల్లా మాజీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, న్యాయవాధి ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురేశ్, జిల్లా ఉపాధ్యక్షురాలు మంజుల, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరేంద్రతో పాటు పలువురు పాల్గొన్నారు.



బీజేపీ కార్యాలయంలో..



అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు, అధికారులు



హోస్పేటలో..



కంప్లిలో..

అంబేడ్కర్ ఆలోచనలు దేశ నిర్మాణానికి దిక్సూచి: కలెక్టర్

హోస్పేట్/బళ్లారిసిటీ/కంప్లి/సిరుగుప్ప/రాయచూరు/గంగావతి రూరల్, డిసెంబరు, 6(ఆంధ్రజ్యోతి) వికాస్ భారత్ లక్ష్యానికి అంబేడ్కర్ విలువలే నిజమైన మార్గదర్శకాలని జిల్లా కలెక్టర్ కవితా ఎస్. మన్నికేరి స్పష్టం చేశారు. శనివారం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్లో జిల్లా పరిపాలన, జిల్లా పరిషత్, సమాజకల్యాణ శాఖ కలిసి నిర్వహించిన అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. దీంతో కలెక్టర్ కవితా ఎస్. మన్నికేరి, ఎస్పీ జాహ్నవి.. అంబేడ్కర్ విగ్రహానికి పుష్పమాలలు సమర్పించిన అనంతరం కలెక్టర్ మాట్లాడతూ డాక్టర్ అంబేడ్కర్, స్వప్నం సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం, ఆధారంగా ఉన్న సమసమాజం అని పేర్కొన్నారు. భాత రాజ్యంగ రూపకర్తగా ఆయన ఇచ్చిన మౌలిక హక్కులు, సమాన అవకాశాలు, అణగారిన వర్గాల కోసం తీసుకువచ్చిన సంస్కరణలు దేశ అభివృద్ధికి శాశ్వత పునాదులుగా నిలిచాయన్నారు. అస్పృశ్యత నిర్మూలన, మహిళా సాధికారత, విద్యహక్కు, సామాజిక, న్యాయం వంటి విలువలు నేటి భారతాన్ని వికాస భారతంగా తీర్చిదిద్దుతున్నాయని కలెక్టర్ అన్నారు. అంబేడ్కర్ చూపిన దారి మన దేశ భవిష్యత్తును ప్రకాశవంతం చేస్తోంది అని ఆయన సిద్ధాంతాలను ఆచరణలో పెట్టినప్పుడే అభివృద్ధి సాధ్యం అని అన్నారు.

● అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా నగరంలోని కౌల్‌బజార్ రైల్వేగేట్ అంబేడ్కర్ భవనం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఎమ్మెల్యే రాఘవేంద్ర హిట్నాల్ , జగన్‌జీవన్ రామ్ తోలు పరిశ్రమల అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు ముండరగి నాగరాజు, జిల్లాహామీపథకాల అమలు అథారిటీ చైర్మన్ చిదానందప్ప, కలెక్టర్ నాగేంద్రప్రసాద్, సీఈఓ మహమ్మద్ హారీస్, ఎస్పీ శోభారాణి, అసిస్టెంట్ కమిషనర్ రాజేశ్, సాంఘిక సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ చిదానందప్ప, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జలాలప్ప పాల్గొన్నారు.



రాయచూరులో..



సిరుగుప్పలో...



బీజేపీ కార్యాలయంలో..

పాలికె ఆరోగ్య స్థాయిసమితి అధ్యక్షుడిగా పేరం వివేక్



వివేక్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి తదితరులు

బళ్లారిరూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగర మహానగర పాలికె ఆరోగ్య స్థాయిసమితి అధ్యక్షుడిగా వివేక్ (విక్కీ), రెవెన్యూ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్‌గా కుబేర శనివారం బాధ్యతలు స్వీకరించారు. పాలికె కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పేరం వివేక్ మాట్లాడుతూ నగరంలో పరిశ్రుభతను కాపాడడలో శ్రద్ధ చూపుతామని, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా ప్రజలు సహకరిచాలన్నారు. కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి కార్పొరేషన్ మాజీ మేయర్ రాజేశ్వరి సుబ్బారాయుడు కార్పొరేషన్ సభ్యులు ఆసిఫ్ బాష, కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోయపాటి విష్ణువర్ధన్, హనుమంతప్ప, గుడిగంట హనుమంతప్ప, కాంగ్రెస్ కాంగ్రెస్ నాయకులు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ఎనర్జీకి ప్రాచుర్యం కల్పిస్తాం

● చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు అవ్వారు మంజునాథ్

బళ్లారి సిటీ,డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి గ్రీన్ ఎనర్జీ అయిన సౌరశక్తిని ప్రజలకు ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి సహకరిస్తుందని చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు అవ్వారు మంజునాథ్ అన్నారు. శనివారం బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సోలార్ ఎనర్జీ అవగాహన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సహజంగా లభించే సూర్యుని వేడిని సౌరశక్తిగా ఉపయోగిస్తున్నారు. ఈ విద్యుత్తు పర్యావరణ అనుకూలమైనదని, వినియోగదారులకు అనుకూలమైనది, శుభ్రమైన శక్తి వనరు ప్రతి ఒక్కరూ ఈ శక్తిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈవిషయంలో టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ నాణ్యమైన వినూత్న సాంకేతిక సేవలను అందిస్తోందని అన్నారు. గౌరవ కార్యదర్శి సరేశ్‌బాబు మాట్లాడుతూ సౌరశక్తి అనేది శుభ్రమైన పునరుత్పాదక శక్తి, సౌరశక్తి పర్యావరణ అనుకూలమైనదని, వినియోగదారులకు అనుకూలమైనది. సౌరశక్తి వినియోగం పెరిగితే ఇతర ఇంధన వనరులపై ఆధారపడటాన్ని నివారించవచ్చన్నారు. ఎస్‌డీబీఐ డివిజనల్ మేనేజర్ లవ్‌కుమార్ సౌరశక్తి ప్రాజెక్టులకు ఆర్థిక సౌకర్యాలు వివిధ రుణ సౌకర్యాలు సులభంగా త్వరగా పొందే అవకాశం గురించి తెలిపారు. ఈసందర్భంగా పారిశ్రామిక సంఘం బళ్లారి యూనిట్ అధ్యక్షుడు రామచంద్ర, స్పాంజ్ ఐరన్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్, బళ్లారి కాటన్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ వి.వెంకటేశ్, జిల్లారైస్ మిల్లు అధ్యక్షుడు నాగరాజ్, వాణిజ్య మండలి ఉపాధ్యక్షుడు దొడ్డనగౌడ, సొంతగిరిధర్, సంయుక్త కార్యదర్శిలు మర్చెడ్ మల్లికార్జునగౌడ, కోశాదికారి నాగల్లి రమేశ్, కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు రాజశేఖర్, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు, వివిధసంఘాలు, సంస్థల ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వాణిజ్య మండలి అధ్యక్షుడు అవ్వారు మంజునాథ్ తదితరులు

750 మందికి ఉచిత వైద్య పరీక్షలు



వైద్యులను సత్కరిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

హోస్పేట్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి) నగరంలోని వాల్మీకి కళ్యాణ మంటపంలో నిర్వహించిన ఉచిత మెగా క్యాంప్‌కు విశేష స్పందన లబించింది. శనివారం జిల్లా వాల్మీకి నాయక్ సర్వీస్, రిటైర్ట్ ఉద్యోగుల అసోసియేషన్, వాల్మీకి తాలూకా నాయక్ అసోసియేషన్, ఫైవ్ లేక్స్ దేవతలు, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ, దావణగెరె నారాయణ హెల్త్‌సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. ఉదయం నుంచి క్యాంప్ ప్రాంగణ రద్దీగా ఉంది. వృద్ధులు, మహిళలు, కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు, యువత ఇలా అన్ని వర్గాల వారు శిబిరానికి వచ్చి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఈసీజీ, ఎకో కార్డియోగ్రామ్, బోన్ జాయింట్, డెంటల్, జనరల్ ఫిజీషియన్, మహిళల ప్రసూతి ప్రత్యేక రోగాలు షుగర్, బీపీ తదితర వ్యాదులపై 750 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా వైద్య అధికారి శంకర్ నాయక్, వైద్యులు హరీష్, ప్రశాంత్, జయశ్రీ, నారాయణస్వామి, వలిభాష, గురుప్రసాద్, పిల్లల వైద్యలు రామకృష్ణ, పిల్లల కార్డియాలజిస్ట్ అనిల్ కుమార్, సుశీల, నికితా, జంబయ్య మహేంద్ర, ప్రశాంత్, సుచిత వైద్య పరీక్షలు చేశారు. అనంతరం వైద్యులను ఘనంగా సత్కరించారు.

వేదవతిపై వంతెన నిర్మించాలని వినతి



ఎంపీ తుకారాంకు వినతి పత్రం అందజేస్తున్న ఎస్‌యూసీఐ సభ్యులు

బళ్లారి సిటీ, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): బసరకోడు, గూళ్యం మధ్యవెళ్ళే వేదవతి నదిపై వంతెన నిర్మించాలని ఎస్‌యూసీఐ శనివారం ఎంపీ తుకారంకు వినతి పత్రం అందజేసింది. దీనికి ప్రతిస్పందిస్తూ ఎంపీ ఈపిటిషన్‌ను అంగీకరించి త్వరలోనే దీనిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తాలూకాలోని బసరకోడు గ్రామం ఆంధ్ర-కర్ణాటక సరిహద్దుల్లో ఉంది. బసరకోడు పక్కన ఉన్నగూళ్యం గ్రామం ఏపీలోని కర్నూలు జిల్లాలో ఉంది. ఈగ్రామాల మధ్య వేదవతి నది ప్రవహిస్తోంది. బసరకోడు నుండి గూళ్యం గ్రామానికి వెళ్ళే వాహనాలు పాదచారులు ఈ నది నీటిలో కి.మీ దూరం ప్రయాణించాలి. నది ఉధృతంగా ప్రవహించే నీటితో నిండి ఉండటం వలన దాని గుండా వెళ్ళే వాహనాలు ఉధృతంగాప్రవహించే నీటిలో చిక్కుకుపోతాయి. వంతెన నిర్మిస్తే ఇరు రాష్ట్రాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని వారు అభిప్రాయపడ్డారు. ఈసందర్భంగా ఎస్‌యూసీఐ కార్యదర్శి దేవదాస్, సభ్యులు హనుమంతప్ప, సిద్దప్ప, అంజినప్ప, మాళప్ప, మల్లయ్య, మల్లికార్జున , శ్రీనివాస్, తిప్పయ్య తదితరలున్నారు.